మోదీ హయాంలోనే అభివృద్ధి



ప్రచారంలో భాగంగా క్షవరం చేస్తున్న కొడీ మహేందర్

చాంద్రాయణగుట్ట: పేదలకు మేలు చేసేలా ఉన్న బీజేపీ మేనిఫెస్టోను చూసి తనను గెలిపించాలని ఆ పార్టీ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం అభ్యర్థి కొడీ మహేందర్ అన్నారు. శివాజీనగర్, రాజన్న బావి తదితర ప్రాంతాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..మోదీ హయాంలోనే పేదలకు ఉచితంగా ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు, వైద్య సాయం కోసం రూ.5 లక్షల ఆయుష్మాన్ భారత్, రైతులకు కిసాన్ సమ్మాన్ పేరుతో ఏడాదికి రూ.6 వేలు, ఇలాంటి మరెన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు.

కార్వాన్‌లో ఊపందుకున్న ఎన్నికల ప్రచారం

- హోరెత్తుతున్న ప్రచారం జోరు
- మజ్లిస్, బీజేపీ హోరాహోరీ..
- మేమున్నామంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం ఉధృతంగా కొనసాగుతోంది. కార్వాన్ సిట్టింగ్ ఎమ్మెల్యేను మజ్లిస్ పార్టీ మరోసారి పోటీకి పెట్టింది. దీంతో సిట్టింగ్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ తమ పార్టీకి చెందిన కార్పొరేటర్లు, ఏరియా కమిటీ నాయకులతో ప్రచార కార్యక్రమానికి సారథ్యం వహిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆయన ప్రతి ఇంటి తలుపు తడుతూ ఓట్లు అడుగుతున్నారు. పదేళ్ల పాలనలో తాను చేసిన అభివృద్ధి పనులు వివరిస్తూ తనను మరోసారి గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. ఆ పార్టీ తరఫున మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఇప్పటికే మూడు రోడ్ షోలు నిర్వహించారు. నాలుగు బహిరంగ సభల్లో కూడా ఆయన పాల్గొని మజ్లిస్‌ను గెలిపించాలని కోరారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ అభ్యర్థిగా స్వామియాదవ్‌ను పోటీకి దింపామని బీజేపీ ఒక్క ముస్లిం అభ్యర్థికి కూడా నిలబెట్టలేదని మజ్లిస్ పార్టీ వారు ప్రచారం నిర్వహిస్తున్నారు.

మజ్లిస్‌కు దీటుగా బీజేపీ..

బీజేపీ అభ్యర్థి టి.అమర్‌సింగ్ మరోసారి బరిలో ఉన్నారు. తనదైన శైలిలో ఆయన ప్రచారం నిర్వహిస్తూ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. ప్రచారంలో అన్ని తానై ముందుకు సాగుతూ ఆయన ప్రత్యర్థులను హడలెత్తిస్తున్నారు. మోదీ పథకాలతో పాటు మోదీ సాధించిన విజయాలను ప్రజలకు వివరిస్తూ ఈసారి తనకు అవకావం కల్పించాలంటూ ఆయన పాదయాత్రలు చేస్తున్నారు. తమకు బలం ఉన్న ప్రాంతాలలోనే బీజేపీ ప్రచారం నిర్వహిస్తూ ముందుకు సాగుతోంది. తండ్రికి తోడుగా అమర్‌సింగ్ తనయుడు టి.యోగ్‌రాజ్‌సింగ్ ప్రచారాన్ని ఉధృతం చేశారు. బీజేవైఎం కార్యకర్తలతో ఆయన ప్రచారం నిర్వహిస్తు ఎలాగైనా ఈ సారి తండ్రిని గెలిపించాలనే పట్టుదలతో ఉన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు సైతం..

బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు మేము సైతం పోటీలో ఉన్నామంటూ ప్రచారం చేస్తు ఓటర్ల దృష్టిని ఆకర్షిస్తున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి మిత్ర కృష్ణ దశాబ్దాల నుంచి రాజకీయాల్లో ఉంటూ జియాగూడ కార్పొరేటర్‌గా కూడా పని చేశారు. ఆయన కూడా ప్రచారంలో తనదే గెలుపు అని ముందుకు సాగుతున్నారు. ఆయన తనయుడు బీఆర్ఎస్ యువ నాయకుడు అభిషేక్ కృష్ణ సైతం బీఆర్ఎస్ యూత్ టీమ్‌లు ఏర్పాటు చేసుకొని ముందుకు సాగుతున్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్ సంక్షేమ పథకాల వల్ల తాము గెలవడం ఖాయమని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్ పార్టీ నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసిన ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్ హాజిరీని ఆ పార్టీ మరోసారం రంగంలోకి దింపింది. ఆయన సైతం పాదయాత్రలతో పాటు కార్నర్ మీటింగ్‌లు పెట్టి ప్రచారంతో మజ్లిస్ పార్టీని హడలెత్తిస్తున్నారు. ఈసారి ఎలాగైనా గెలవాని కాంగ్రెస్ అభ్యర్థి విశ్రాంతి లేకుండా పాదయాత్ర చేస్తూ ఎన్నికల ప్రచారాలు నిర్వహిస్తున్నారు. ఏదేమైనా పోటీ మాత్రం మజ్లిస్, బీజేపీల మధ్యనేనని ప్రజలు అనుకుంటున్నారు.

'రాజాసింగ్‌ను నమ్మితే నట్టేట ముంచుతాడు'



ప్రచారం చేస్తున్న జగన్‌మోహన్‌రావు, నందకిశోర్ వ్యాస్, పురుషోత్తమ్ రావు

అబిడ్స్: బీజేపీ అభ్యర్థి ఎమ్మెల్యే రాజాసింగ్‌ను ప్రజలు నమ్మితే నట్టేట ముంచుతాడని రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చైర్మన్ పి.జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. పదేళ్లుగా ప్రజలను మోసం చేసిన బీజేపీని చిత్తుగా ఓడించాలని ఆయన అన్నారు. గురువారం జ్ఞాన్‌బాగ్ కాలనీలో అసోసియేషన్ నాయకులు బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ పి.జగన్‌మోహన్‌రావు పాల్గొని ప్రసంగించారు. ఒక్కసారి బీఆర్ఎస్‌ను గెలిపిస్తే గోషామహల్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం నందకిశోర్‌వ్యాస్ మాట్లాడుతూ..తనను గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి 24 గంటల పాటు అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. బీఆర్ఎస్‌తోనే కోట్ల రూపాయాల అభివృద్ధి చేశామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ దాగా, ఆల పురుషోత్తమ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి గుణపాఠం తప్పదు



ప్రచారం చేస్తున్న చలపతిరావు, ఆశీష్‌కుమార్‌యాదవ్

అబిడ్స్: పదేళ్లుగా గోషామహల్ అభివృద్ధిని విస్మరించిన బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు గుణపాఠం తప్పదని రాష్ట్ర బీఆర్ఎస్ కార్మిక విభాగం ఈఎస్ఐ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.చలపతిరావు, గోషామహల్ బీఆర్ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఏ ప్రాంతానికి వెళ్లినా బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారన్నారు. గురువారం జాంబాగ్‌లోని పలు ప్రాంతాల్లో వారు ఇంటింటా పర్యటించి ప్రచారం చేశారు. అనంతరం మాట్లాడుతూ..ఎమ్మెల్యే రాజాసింగ్‌ను గోషామహల్ ప్రజలు రెండుసార్లు గెలిపిస్తే అభివృద్ధి మాత్రం శూన్యమే చేశారన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ధన్‌రాజ్, నరేందర్ యాదవ్, సురేష్, అనిత తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో తెలంగాణ టాప్



కరపత్రం అందజేసి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న సీహెచ్. ఆనంద్‌కుమార్ గౌడ్

నాంపల్లి/ విజయనగర్‌కాలనీ: తెలంగాణ రాష్ట్రం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీతో పాటు అన్ని రంగాల్లో దేశంలోనే ఉన్నతంగా నిలిచిందని బీఆర్ఎస్ నాంపల్లి నియోజకవర్గం అభ్యర్థి సీహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. బుధవారం నాంపల్లి నియోజకవర్గంలోని ఆసిఫ్‌నగర్, శంకర్‌నగర్, దాయిబాగ్, కిషన్‌నగర్, హుడాకాలనీ తదితర ప్రాంతాల్లో డివిజన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సీహెచ్. లక్ష్మీనారాయణ, శీలం బాల్‌చందర్‌తో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యులతో పాటు వ్యాపార సముదాయాల్లో యజమానులను కలిసి కారు గుర్తుకు ఓటువేసి తనను గెలిపిస్తే మీకు అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రాధాన్యత క్రమంలో త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణగౌడ్, వెంకటేష్‌గౌడ్ రేణేశ్వర్ గౌడ్, గంజి రజిని, వాలి తదితరులు పాల్గొన్నారు.

గోషామహల్‌ను గచ్చిబౌలి తరహాలో అభివృద్ధి చేస్తాం



ప్రచారం చేస్తున్న దాసోజు శ్రవణ్‌కుమార్, పరమేశ్వరీ సింగ్

అబిడ్స్: బీఆర్ఎస్‌ను గెలిపిస్తే గచ్చిబౌలి తరహాలో గోషామహల్‌ను అభివృద్ధి చేస్తామని నగర బీఆర్ఎస్ ఇన్‌చార్జి దాసోజు శ్రవణ్‌కుమార్ పేర్కొన్నారు. పదేళ్లుగా అభివృద్ధిని విస్మరించిన బీజేపీని ఓడించాలని ఆయన అన్నారు. గురువారం రహీంపురా పరిసర ప్రాంతాల్లో పర్యటించి ప్రసంగించారు. నగరంలో పలు ప్రాంతాలు ఎంతో అభివృద్ధి చెందాయని, గోషామహల్‌లో బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ఉన్నందునే అభివృద్ధి కుంటుపడిందన్నారు. కేవలం మతాల మధ్య విద్వేషాలు సృష్టిస్తూ ఓట్లు దండుకున్న రాజాసింగ్ అభివృద్ధిని మాత్రం గాలికి వదిలేశారన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్‌ను గెలిపిస్తే పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పరమేశ్వరీ సింగ్, ఉమాదేవి వ్యాస్, నవనీత, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు త్రివేణి సంగంలో జ్వాలా తోరణం

లంగర్‌హౌస్: డుప్పి పున్నమి మక్తి స్నానాల జాతర నేటి నుంచి లంగర్‌హౌస్ త్రివేణి సంగం ఒడ్డున వెలసిన జాకనీ సమేత వీరవెంకట విజయరాఘవ స్వామి మఠ ఆలయంలో ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా నేడు సాయంత్రం ఆలయంలో తులసీ లక్ష్మీ నారాయణుల వివాహం జరుగనుంది. అనంతరం కల్యాణ తులసీ లక్ష్మీనారాయణులను పల్లకీలో ఊరేగిస్తారు. 8 గంటలకు రాంలీలా మైదానంలో జ్వాలాతోరణం వెలిగించి కింది నుంచి తులసీ నారాయణులతో పాటు పీఠాధిపతి రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో భక్తులు ప్రదక్షిణలు చేస్తూ ఈదనున్నారు.

27న మీరాలంమండిలో మహా అన్నకూట మహోత్సవాలు

చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో ఈనెల 27న మహా అన్నకూట మహోత్సవాలను నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం 6 గంటలకు మహాభిషేకం, అలంకారం, శ్రీచక్ర అర్చన, స్వామి వారికి రుద్రాభిషేకం, ఆంజనేయ స్వామి వారికి అభిషేకం, ఆకు పూజ, మంగళ హారతి, 11 గంటలకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం, 12.30 గంటలకు తులసి పూజ, సాయంత్రం 5.30 గంటలకు సహస్ర దీపాలంకరణ సేవ, ఆకాశ దీపం, 7 గంటలకు పంచహారతి, సామూహిక హారతి, 7.15 గంటలకు మహా అన్నకూట (అన్న ప్రసాదం) కార్యక్రమాలను నిర్వహించనున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు.

అఫ్జల్‌సాగర్‌లో బీజేపీ ఇంటింటి ప్రచారం

నాంపల్లి: బీజేపీ అభ్యర్థి జేఎల్.రాహుల్‌చంద్ర గురువారం అఫ్జల్‌సాగర్‌లో ఇంటింటి ప్రచారం చేశారు. ప్రతి ఒక్కరిని కలుస్తూ బీజేపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. బీజేపీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో బీసీ ముఖ్యమంత్రి అవుతారని, రాష్ట్రానికి సరిపడా నిధులు సమకూరుతాయని చెప్పారు. కాంగ్రెస్, మజ్లిస్ పార్టీ అభ్యర్థులకు ఓట్లు వేయవద్దని కోరారు. జగన్నాథరాజ్, విజయ్‌సింగ్, అర్జున్ సింగ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం



లంగర్‌హౌస్: అభివృద్ధి పథకాలే తనను భారీ మెజార్టీతో గెలిపిస్తాయని కార్వాన్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి మిత్రక్రిష్ణ అన్నారు. లంగర్‌హౌస్‌లో గురువారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. మిత్ర క్రిష్ణ మాట్లాడుతూ.. తెలంగాణ భావితరాల ఉజ్వల భవిష్యత్తుకు సీఎం కేసీఆర్ చేపట్టిన పనులను అందరూ స్వాగతిస్తున్నారని, ప్రజా సంక్షేమం కోసం తీసుకువచ్చిన అనేక సంక్షేమ పథకాలు దేశవ్యాప్తంగా మన్ననలు పొందాయన్నారు. చంద్రకాంత్, కార్తీక్, ఎస్ రాజు పాల్గొన్నారు.

బీజేపీకి విశేష ఆదరణ



అమర్‌సింగ్‌కు మంగళహారతులు పడుతున్న మహిళ

జియాగూడ: కార్వాన్ నియోజకవర్గంలో బీజేపీకి విశేష ఆదరణ లభిస్తుందని బీజేపీ అభ్యర్థి అమర్‌సింగ్ అన్నారు. గురువారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో నీరాజనం పడుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 24న గుడిమల్కాపూర్ నుంచి కార్వాన్, జియాగూడ సంజయ్‌నగర్ నల్లపోచమ్మ ఆలయం వరకు పలు బస్తీల మీదుగా కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ రోడ్డుషో ఉంటుందన్నారు.

జియాగూడలో బీఆర్ఎస్ ప్రచారం



సంజయ్‌నగర్‌లో మహిళకు బొట్టుపెట్టి ఓటు వేయాల్సిందిగా కోరుతున్న మిత్ర కృష్ణ

జియాగూడ: కేసీఆర్ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి లబ్ధి చేకూర్చాయని దీంతో ప్రజలు స్వచ్ఛందంగా ఓటు వేస్తామని హామీ ఇస్తున్నారని కార్వాన్ బీఆర్ఎస్ అభ్యర్థి మిత్రకృష్ణ అన్నారు. గురువారం జియాగూడలోని బంగిబస్తీ, సంజయ్‌నగర్, జియాగూడ డబుల్‌బెడ్‌రూమ్, కేశవ స్వామినగర్, నవోదయనగర్‌లలో ఇంటింటికి వెళ్లి ఓటు వేయాల్సిందిగా అభ్యర్థించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మహిళలు మహిళలకు బొట్టుపెట్టి ఓటు వేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సంజయ్‌నగర్ సంత్‌రవిదాస్ మోచీ సమాజ్ అధ్యక్షుడు మహేష్కర్ కాంతిలాల్, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు నర్మద, డివిజన్ ఇన్‌చార్జి మంతటి నర్సింహ, మహిళా అధ్యక్షురాలు సంగీత, శ్రీనివాస్‌గుప్తా, నరహరిచారి ఉమేష్ పాల్గొన్నారు.

స్వచ్ఛమైన పాలన కోసం బీజేపీని గెలిపించాలి



మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి అమర్‌సింగ్

గోల్కొండ: బీఆర్ఎస్ అండతో మజ్లిస్ పార్టీ హైదరాబాద్‌లో గుండాగిరి చేస్తుందని కార్వాన్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి టి.అమర్‌సింగ్ అన్నారు. గురువారం గుడిమల్కాపూర్‌లో జరిగిన బీజేపీ కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. అసదుద్దీన్ ఒవైసీ ఎన్నికల విధుల్లో ఉన్న ఓ పోలీస్ అధికారిని దూషించి తన గుండాగిరిని చాటుకున్నారన్నారు. బీఆర్ఎస్ అండతో మజ్లిస్ అరాచకాలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయని ఇటువంటి వారిని ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పదేళ్లల్లో బీఆర్ఎస్ పార్టీ తెలంగాణను అన్ని విధాలుగా దోచుకొని రాష్ట్రాన్ని దివాలా తీయించిందని ఆయన ఆరోపించారు. మరోవైపు కాంగ్రెస్ సైతం ప్రజలను మోసం చేయడానికి రంగంలోకి వచ్చిందన్నారు. స్వచ్ఛమైన పాలన కోసం బీజేపీని గెలిపించాలని ఓటర్లను ఆయన కోరారు. నాయకులు సునీల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వదించి మరోసారి గెలిపించండి



ఎన్నికల ప్రచారంలో మజ్లిస్ అభ్యర్థి కౌసర్

గోల్కొండ: ఈసారి కూడా తనను ఆశీర్వదించి ఓటు వేసి గెలిపించాలని కార్వాన్ సిట్టింగ్ ఎమ్మెల్యే, మజ్లిస్ అభ్యర్థి కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన నానల్‌నగర్, గోల్కొండ డివిజన్‌లలో ఇంటింటికీ తిరిగి ఓటర్లను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గాన్ని గత పదేళ్లల్లో ఎంతగానో అభివృద్ధి చేశానన్నారు. తమ పార్టీపై బీజేపీ వారు ఎన్నో అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని అయితే తమ పార్టీ నిజాయితీ ముందు వారి ఆరోపణలు నిలవడం లేదని ఆయన అన్నారు. ప్రజా సంక్షేమం కోసం మజ్లిస్ దేనికైనా తెగిస్తుందని ఆయన అన్నారు. నేడు తమ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ సైతం పేద కార్మికుల పక్షాన నిలిచిపోరాడుతున్న ఏకైక నాయకుడని ఆయన అన్నారు. ఈసారి కూడా కార్వాన్ నుంచి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నసీరుద్దీన్, నాయకులు బదరుద్దీన్, షకీల్‌ఆలీఖాన్, ఏకే పఠాన్ తదితరులున్నారు.

తెలంగాణ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శం



బీఆర్ఎస్ నాయకులతో కార్వాన్ అభ్యర్థి మిత్ర కృష్ణ

గోల్కొండ: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శమని బీఆర్ఎస్ కార్వాన్ నియోజకవర్గం అభ్యర్థి మిత్ర కృష్ణ అన్నారు. గురువారం ఆయన కార్వాన్, నానల్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల లబ్ధిపొందని పేద కుటుంబం లేదని, ఆ కుటుంబాల వారంతా నేడు బీఆర్ఎస్ పక్షానే ఉన్నారని ఆయన అన్నారు. కార్వాన్ నియోజకవర్గం నుంచి ఈసారి తనకు అవకాశం కల్పించాలని ఆయన ఓటర్లను కోరారు. పదేళ్ల పదవీ కాలంలో రాష్ట్రాన్ని ఆర్థికంగా పటిష్టపరిచిన కేసీఆర్ మరోసారి విజయం సాధించి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఆయన అన్నారు. తూమ్‌కుంట అరుణ్‌కుమార్, అభిషేక్‌మిత్ర తదితరులున్నారు.

యాకుత్‌పురాలో మజ్లిస్ ప్రచారం



ప్రచారం చేస్తున్న జాఫర్ హుస్సేన్ మేరాజ్

యాకుత్‌పురా: మజ్లిస్ పార్టీ యాకుత్‌పురా ఎమ్మెల్యే అభ్యర్థి జాఫర్ హుస్సేన్ మేరాజ్ గురువారం నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. రెయిన్‌బజార్, ఎస్ఆర్టీ కాలనీ, యాకుత్‌పురా రైల్వేస్టేషన్, తలాబ్‌కట్టా షా జహాన్ ఫంక్షన్‌హాల్, ఖలీఫా రోడ్డు, ఒవైసీ స్కూల్, అక్రంనగర్, డైమండ్ హోటల్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ..తమ పార్టీ ప్రజలకు చేస్తున్న అభివృద్ధితో తిరిగి భారీ మెజార్టీతో విజయం సాధిస్తామన్నారు. యాకుత్‌పురా ఇన్‌చార్జియాసర్ అరఫత్, కార్పొరేటర్లు మహ్మద్ వసివుద్దీన్, డాక్టర్ సమీనా బేగం పాల్గొన్నారు.

రాజాసింగ్‌కు ఓటమి భయం పట్టుకుంది



బొగ్గులకుంటలో ప్రచారం నిర్వహిస్తున్న నందకిశోర్ వ్యాస్

సుల్తాన్‌బజార్: రాజాసింగ్‌కు ఓటమి భయం పట్టుకుందని బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ కార్పొరేటర్ మమతా సంతోష్‌గుప్తా నేతృత్వంలో గురువారం గోషామహల్ నియోజకవర్గం గన్‌ఫౌండ్రీ డివిజన్‌లోని బొగ్గులకుంటలో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ఇన్‌చార్జి దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ..గోషామహల్ నియోజకవర్గంలో ఈసారి ప్రజలు బీఆర్ఎస్‌వైపే మొగ్గు చూపుతున్నారన్నారు. రాంచందర్ రాజు, శీలం సరస్వతి, శ్రీనివాస్ యాదవ్, దిలీప్ ఘనాటే పాల్గొన్నారు.

అభివృద్ధికి మారుపేరు కాంగ్రెస్



ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థి ఉస్మాన్ బిన్ హాజీరి

గోల్కొండ: మజ్లిస్‌కు ఓటు అభివృద్ధికి చేటు అని కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి ఉస్మాన్ బిన్ అల్ హాజీరి అన్నారు. గురువారం ఆయన నానల్‌నగర్, లక్ష్మీనగర్ చౌరస్తా, ఖాదర్‌బాగ్ తదితర ప్రాంతాల్లో పాదయాత్ర చేశారు. ఆయన ఓటర్లను కలుసుకొని కాంగ్రెస్ ఆరు గ్యారంటీల కరపత్రాలను పంచిపెట్టారు. అభివృద్ధికి మారుపేరు కాంగ్రెస్ పార్టీ అని ప్రజల కనీస మౌలిక సదుపాయాల కల్పనలో కాంగ్రెస్ పార్టీకి ఏ పార్టీ కూడా సరికాదని ఆయన అన్నారు. బీజేపీ మేనిఫెస్టో లేని పార్టీ అని ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు చేయడమే దాన్ని ప్రధాన ఎజెండా అని ఆయన విమర్శించారు. మరోవైపు రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనతో తెలంగాణ దివాలా తీసిందని కేసీఆర్ కుటుంబంతో పాటు బీఆర్ఎస్ నాయకులే బాగుపడ్డారని ఆయన అన్నారు.

బీఎస్పీని ఆదరించండి



ప్రచారంలో బీఎస్పీ అభ్యర్థి మూల రాంచరణ్ దాస్

చార్మినార్: ఈ ఎన్నికలలో బీఎస్పీకి ఓటు వేసి ఈ ఒక్కసారి గెలిపించాలని చాంద్రాయణగుట్ట బీఎస్పీ అభ్యర్థి మూల రాంచరణ్ దాస్ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నియోజకవర్గంలోని పలు బస్తీల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. చాంద్రాయణగుట్ట నియోజకవర్గం నుంచి బీఎస్పీకి ఈసారి ఒక్క అవకాశం ఇవ్వాలని స్థానిక ఓటర్లను కోరారు. ఏళ్ల తరబడి మజ్లిస్ పార్టీకి అవకాశం ఇస్తున్నారని ఆయన అన్నారు.

అభివృద్ధి చేస్తా..అవకాశం ఇవ్వండి



ప్రచారం నిర్వహిస్తున్న యుగతులసి అభ్యర్థి కరుణ

చాంద్రాయణగుట్ట: నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు తనకు అవకాశం కల్పించాలని యుగ తులసి పార్టీ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం అభ్యర్థి ఆడాల కరుణ కోరారు. ఉప్పుగూడలో గురువారం ఆమె ఇంటింటికి తిరుగుతూ రోడ్డు రోలర్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. ఆమె మాట్లాడుతూ.. గోవును జాతీయ ప్రాణిగా గుర్తించాలని తమ పార్టీ నినాదంతో ముందుకు వెళుతుందన్నారు.

మంగారి రాజేందర్ బహుముఖ ప్రజ్ఞాశాలి



మంగారి రాజేందర్‌ను సన్మానిస్తున్న ఆచార్య ఎల్లూరి శివారెడ్డి

సుల్తాన్‌బజార్: న్యాయవాదిగా, న్యాయమూర్తిగా వృత్తి గతంగా, కవిగా, కథా రచయితగా, అనువాదకునిగా ప్రవృత్తి గతంగా తెలుగు భాషకు విశేషమైన సేవలు అందిస్తున్న మంగారి రాజేందర్ జింబో బహుముఖ ప్రజ్ఞాశాలి అని తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అన్నారు. గురువారం పరిషత్తులోని డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో మంగారి రాజేందర్ 'నేను-నా రచనలు' శీర్షికన తమ జీవితం సాహిత్య జీవితంపై ప్రసంగం చేశారు. కార్యక్రమంలో ఆచార్య శివారెడ్డి అధ్యక్షోపన్యాసం చేశారు. తెలుగు విశ్వ విద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీ శంకర్ విశిష్ట అతిథిగా ప్రసంగిస్తూ జింబో కలం పేరుతో రచనలు చేస్తున్న మంగారి రాజేందర్ కొన్ని సంవత్సరాల కిందటే న్యాయమూర్తిగా తెలుగులో తీర్పు వెలువరించిన ఘటన సంచలనమైందని తెలిపారు.

బీఆర్ఎస్‌ను గెలిపిస్తే పెద్ద ఎత్తున అభివృద్ధి



ప్రచారంలో దామోదర్‌గుప్తా తదితరులు

అబిడ్స్: గోషామహల్‌లో బీఆర్ఎస్‌ను గెలిపిస్తే మంత్రి కేటీఆర్ గోషామహల్‌ను దత్తత తీసుకుని పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తారని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా పేర్కొన్నారు. పదేళ్లుగా బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ గోషామహల్‌లో నయాపైసా అభివృద్ధి చేయకపోవడంతో మంత్రి కేటీఆర్ గోషామహల్‌ను దత్తత తీసుకునేందుకు ముందుకు వచ్చారన్నారు. గురువారం శివలాల్‌నగర్, అప్పర్ ధూల్‌పేట్ ప్రాంతాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. అనంతరం దామోదర్‌గుప్తా మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్‌వ్యాస్‌ను గెలిపిస్తే గోషామహల్‌ను మంత్రి కేటీఆర్ దత్తత తీసుకుని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా అభివృద్ధి చేస్తారన్నారు. కేవల్‌సింగ్, బల్‌దీప్‌సింగ్, రాకేష్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం



చుడిబజార్‌లో ప్రచారం చేస్తున్న సునీతారావు

అబిడ్స్: కాంగ్రెస్‌ను గెలిపిస్తే ప్రజలకు లబ్ధిచెందే ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేస్తామని గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి మొగిలి సునీతారావు పేర్కొన్నారు. ప్రజలకు రూ.500 లకే గ్యాస్ సిలిండర్ ఇస్తామన్నారు. గురువారం చుడిబజార్, బేగంబజార్ ఛత్రి, ఎంజే బ్రిడ్జి తదితర ప్రాంతాల్లో ఆమె పర్యటించి ప్రచారం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్ఎస్‌లు కుమ్మక్కై ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. తనను గెలిపిస్తే ప్రతి ఇంటికి 200 యూనిట్ల కరెంటు ఉచితంగా ఇస్తామన్నారు.

ఈవీఎంల కమిషనింగ్ షురూ

చాంద్రాయణగుట్ట: నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంల కమిషనింగ్‌ను అధికారులు నిజాం కాలేజీలోని డీఆర్‌సీ సెంటర్‌లో ప్రారంభించారు. పోటీలో ఉన్న అభ్యర్థులకు సంబంధించిన పార్టీ పేరు, అభ్యర్థి పేరు, గుర్తులతో కూడిన వివరాలను ఈవీఎంలో అప్లోడింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ఎం.సూర్య ప్రకాష్ పర్యవేక్షణలో ఈ కమిషనింగ్ కార్యక్రమం కొనసాగుతోంది.



ఈవీఎంల కమిషనింగ్‌ను పర్యవేక్షిస్తున్న ఆర్‌వో సూర్యప్రకాష్

గృహిణి అదృశ్యం



రేణుక (ఫైల్)

సుల్తాన్‌బజార్: విధులకు వెళ్లి ఓ గృహిణి అదృశ్యమైన ఘటన సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ శ్వేత తెలిపిన వివరాల ప్రకారం.. గోల్నాకకు చెందిన రేణుక (31), రాంకోఠిలోని విశిష్ట అపార్ట్‌మెంట్‌లో ఇంటి పనులు చేస్తూ జీవనం సాగిస్తుంది. ఈనెల 21న విధులకు వెళ్లిన రేణుక రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై చుట్టు పక్కల ప్రాంతాల్లో తెలిసిన వారిని వాకాబు చేసినా ఫలితం లేకపోవడంతో గురువారం సుల్తాన్‌బజార్ పోలీసులను ఆశ్రయించారు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు రేణుక ఆచూకి కోసం గాలిస్తున్నారు.

గుల్జార్‌హౌస్‌లో అగ్నిప్రమాదం

దూద్‌బౌలి: గుల్జార్‌హౌస్ వద్ద కాలికమాన్ రోడ్డులోని ఓ విద్యుత్ స్తంభానికి ఉన్న కేబుల్ నెట్ వైర్లలో షార్ట్ సర్క్యూట్ కారణంగా గురువారం ఉదయం 9 గంటలకు విద్యుత్ ప్రమాదం జరిగింది. దట్టమైన పొగలు అలముకున్నాయి. అగ్నిప్రమాదం కారణంగా స్థానిక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలకు అంతరాయం కలిగింది. చార్మినార్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించి పరిస్థితిని చక్కదిద్దారు.

కాంగ్రెస్‌ను గెలిపించండి



ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి బోయ నగేష్

చాంద్రాయణగుట్ట: నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన కాంగ్రెస్ పార్టీకి ఒక్కసారి అవకాశం కల్పించాలని ఆ పార్టీ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం అభ్యర్థి బోయ నగేష్ అన్నారు. నియోజకవర్గంలో గురువారం ఆయన ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించి హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. పాత బస్తీని రూ.2 వేల కోట్ల నిధులతో అభివృద్ధి చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. ఆరు గ్యారంటీ పథకాలను ఇప్పటికే నచ్చిన ప్రజలు కాంగ్రెస్‌కు మొగ్గు చూపుతున్నారన్నారు.

ఘనంగా పల్లకీ సేవ



అబిడ్స్: గుడిమల్కాపూర్ సాయిబాబా త్రయంబకేశ్వర ఆలయంలో పల్లకీ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున స్థానిక భక్తులు పాల్గొని కార్తీకమాసం పల్లకీ సేవను చేపట్టారు. ఆలయంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.